

# గూడు

చౌదరీ కూర్చున్న వరండా చివరమాత్రం కొద్దిగా ఎండ పడుతోంది. అటువేపు బైటకి చూస్తూ....'ఛ....ఏమిటింత దరిద్రంగా....' అనుకున్నాడు.

పక్కకి తిరిగిచూశాడు. నీలంరంగు వేసిన గోడ మెరుస్తోంది. రెండోపక్కకి తిరిగాడు, అలా తిరగటంలో మెడకి దగ్గరగా వచ్చిన చేతి వాచీ చెవుకి తగిలింది. ఒకటి, రెండు....టిక్....టిక్‌లు విన పడ్డాయి.

'ఎనిమిదింటి వరకూ గడవాలి....' అనుకున్నాడు. చుట్టూ కలయచూసినా తన ఆలోచనలు తినటాని కేం కనపడలేదు. 'పోనీ పడుకుంటే....' అనుకున్నాడు. అప్పటిదాకా విపరీతంగా నిద్రపోయిన బరువు కళ్ళలో కదిలింది. 'రాదు....యింక నిద్రరాదు....రాత్రి ఎనిమిదింటివరకు యిలా తప్పదు'....అనుకున్నాడు.

'ఏం చెయ్యాలి....రమేష్ యింకా రాలేదు. వస్తే కాస్సేపు ఏదేనా సోది చెపుతాడు. రాత్రి ఎనిమిదింటి వరకూ వాడితో గడిపితే.... వచ్చేవాళ్ళు వస్తారు—ఆ డీల్ పూర్తి చేసుకోవచ్చు. మామూలే.... థ్రిల్ లేదు. తను ఏదో రేట్ చెపుతాడు....యిదివరకు కన్నా ఎక్కువ ....ఫేక్టరీ మెయింటెనెన్స్ పెరిగిందంటాడు....వాళ్ళు నసుగుతారు. కాని వాళ్ళకి తీసుకోక తప్పదు. తీసుకుని, వాళ్ళమ్మేటప్పుడు ధర పెంచి

అమ్ముతారు. అంతా మామూలే....తన కెంత లాభమో....వాళ్ళకీ అంతే. మరి నష్టం.... నష్టం ఎవరికీ....ఛత్....దరిద్రంగా ఏమిటీ ఆలోచనలు....ఎక్కడికేనా పోతే....రమేష్ వస్తే....వర్షం వచ్చేటట్టు వుంది. వస్తాడా....

కుర్చీలోంచి లేచాడు చౌదరీ. వరండా చివరివరకూ వచ్చి తలెత్తి ఆకాశంలోకి చూశాడు. భూమ్మీదికి వస్తున్న ఎండని మబ్బులు ఆకలిగా తినేస్తున్నాయి. అలాగే చూస్తూ....వర్షం వస్తుందేమో.... వస్తే రమేష్ రాడు....వెధవ గొడవ....అనుకున్నాడు.

* * *

మీద పడ్డ మర్రికాయంత చినుక్కి కళ్ళు తెరిచింది కాంతం. లేవాలి....అనుకునేంతలోనే మరో రెండు చినుకులు పడ్డాయి మీద. పక్కనున్న పసిగుడ్డు మీంచి చేతిని తీసుకుని నెమ్మదిగా లేచింది. తనతోపాటు నిన్నటినుంచి తిండిలేని కాంతం కళ్ళలోని నీరసంకూడా లేచింది.

తల పైకెత్తి చూసింది నీరసం. ఆకాశంలోని మబ్బులన్నీ ఆ మర్రిచెట్టు మీదకే దూకుతున్నట్టు కనపడ్డాయి. అన్నిటికన్నా దగ్గరగా కనిపిస్తున్న, వీధిచివరి నీలం మేడ ఫర్లాంగు దూరంకన్నా ఎక్కువ లేక పోయినా అరకోసులా కనపడింది కాంతానికి. పిల్లాణ్ణి చేతుల్లోకి తీసుకుని రెండడుగు లేసింది. పరిగెట్టాలనుకుంది.....కాళ్ళు కదల్లేదు— టపటపా....వొక్కసారిగా చుట్టూపడ్డాయి చినుకులు. మళ్ళీ మర్రిచెట్టు మొదట్లోకి రాకతప్పలేదు.

'మామూలుగా మొన్నటిదాకా పోయే బస్స్టాండ్ షెడ్లోకి పోయినా బాగుండి ఉండేది. ఇక్కడ చిక్కడిపోయాను....' అను కుంది పిల్లాణ్ణి తడివి చూసుకుంటూ. ఎంత ఒదిగి నిలబడ్డా జల్లు కొడు తూనే ఉంది.

'ఇక్కడైతే ఈ చిక్కు....అక్కడైతే ఆళ్ళ చిక్కు....' గొణుక్కుంది నెమ్మదిగా....

'కాన్పు కష్టమైంది కాని, లేకపోతే ఈ భయం ఉండేదికాదు' ... అనుకుంది.... అలా అనుకుంటుంటే షెడ్డు.... షెడ్డులో రాత్రిళ్ళు పడుకోటానికొచ్చే అడుక్కుతినే దున్నపోతులు గుర్తొచ్చాయి.

'ఎవడికో దొరక్క దొరక్క కడుపునిండా తిండి దొరుకుద్ది ....ఆ రోజే కోరిక పుడద్ది....బాలింతరాల్ని వద్దన్నా వినే వోపికుండి చావదు.... అందుకనే ఆళ్ళకి నాలుగు రోజులు దూరంగానేఉంటే మంచిది.'

మళ్ళీ తల పైకెత్తి చూసింది కాంతం. కళ్ళ మసకలోంచి మబ్బులు మరీ నల్లగా కనపడ్డాయి. జల్లునుంచి తప్పించుకుంటూ నెమ్మదిగా పిల్లాడితోపాటు చెట్టు మొదట్లోకి వొదిగి, ముడుచుకుని కూచుండిపోయింది.

* * *

కుర్చీ ఎంత జరుపుకు కూర్చున్నా జల్లు కొద్దిగా మీద పడుతూనే ఉంది. గాలెక్కువగా ఉంది. వర్షంకన్నా....

కురిసేదేదో గబగబా వొకేసారి కురవకూడదూ....మనసులోనే విసుక్కున్నాడు చౌదరీ.

వెధవిల్లు....ఊరి చివర తగలబడింది....మనిషన్నవాడు కనపట్టంలేదు.... అనుకున్నాడు, జల్లు తప్పించుకోలేక కుర్చీలోంచి లేస్తూ...

వరండాలోనే వెలుగు తక్కువగా ఉంది....లోపల మరీ చీకటిగా ఉంది. లైటువేశాడు. వెలగలేదు. స్విచ్‌ని నాలుగైదుసార్లు విసుగ్గా వేశాడు....అర్పాడు....ఏం చెయ్యటానికి తోచటంలేదు. వర్షం ఒక్కటే చూట్టానికేనా, వినటానికేనా ఎదురుగా ఉంది. గుమ్మంలో నిలబడి చూపు అందినంతవరకూ చూస్తే, యించుమించు ఫర్లాంగు దూరంలో పెద్ద చెట్టుతప్ప మరేం కనపళ్ళేదు. చౌదరీ అలా చూస్తుండగానే గేటులోంచి వరండాలోకి తను పరుగెత్తుకొచ్చింది.

చౌదరీని చూసి తటపటాయించింది ముందు. తర్వాత నెమ్మ

దిగా వచ్చి కుర్చీపక్కగా గోడకానుకుని నిలబడింది. కాస్సేపు అలాగే చూశాడు. విసురుగా గాలి మరోసారి వర్షాన్ని మోసుకొచ్చింది వరండాలోకి....

''అక్కడ తడిసిపోతావు....లోపలికి రా....'' అన్నాడు. తనేం మాట్లాడలేదు. ఇంచుమించు పూర్తిగా తడిసిపోయేఉంది.

''ఫరవాలేదు లోపలికి రా....'' అన్నాడు మళ్ళీ. అప్పుడూ మాట్లాడలేదు....''విన్నే....'' అన్నాడు కొంచెం గట్టిగా....

తను నెమ్మదిగా కదిలింది.

''మీ యిల్లు ఇక్కడికి దగ్గరేనా....'' అన్నాడు. లోపలి కొచ్చాక, కాదన్నట్టు తల అడ్డంగా వూపింది....గుమ్మంలోనే నిల బడింది.

''మరి ఎక్కడ....బాగా దూరమా....'' అన్నాడు.

ఇందాకటిలాగే కాదన్నట్టు మళ్ళీ తలూపింది.

''అయితే ఈ వూరు కాదా మీది....'' అన్నాడు.

''ఈ వూరే కాని యిల్లెక్కడా లేదు....''అంది నెమ్మదిగా....

చలికి కొద్దిగా వణికిపోతోంది తను. బట్టలు వొంటికి అతుక్కు పోయున్నాయి. ఉండి....ఉండి ఒక్కసారిగా లైటు వెలిగింది.

తడిసిపోయున్న ఆ నాసిరకం బట్టల్ని ధైర్యంగా చూశాడు చౌదరీ....

''ముష్టిదానవా....'' అన్నాడు.

తలొంచుకుంది.

కుర్చీలో కూచుని సిగరెట్టు వెలిగించుకున్నాడు,

''నీ కెవ్వరూ లేరా....'' అన్నాడు. తను సమాధానం చెప్ప కుండానే ''అన్నం తిన్నావా ఇవాళ''....అన్నాడు.

తను తినగా కారేజీలో మిగిలిపోయిన అన్నం ఉంచే తీసు కొచ్చి ముందు పెట్టాడు.

గుమ్మంలోనే కూచుని తింది. తింటూ....తింటూ మధ్యలో కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"ఏం...ఏమైంది...." అన్నాడు చౌదరీ కుర్చీలోంచి లేస్తూ ....తనేం మాట్లాడలేదు. కొంగుని మరింతగా కళ్ళమీద కప్పుకుంది.

"విన్నే....ఏమైంది...." అన్నాడు చౌదరీ కొంచెం కంగారుగా,

ఎక్కిళ్ళకి ఎంగిలిచెయ్యి అడ్డం పెట్టుకుంటూనే చెప్పింది.... "అమ్మ కిందటివారం ఇదేరోజు చచ్చిపోయింది"....అని....ఏడుపు గొంతులోంచొచ్చిన ఆ మాటలు చాలా నెమ్మదిగా వినపడ్డాయి చౌదరీకి. ఏం చెయ్యాలో తోచలేదు.

"వూరుకో....ఏడవకు....ముందు అన్నంతిను" అన్నాడు దగ్గరగా కుర్చీ లాక్కుంటూ....

తనేం మాట్లాడలేదు. ఏడుపు ఆపుకుంటూ ముద్ద చేతిలోకి తీసుకుంది.

"నీ పే రేమిటి...." ఆ ఎడుపు చూట్టం ఇష్టంలేక అడిగాడు చౌదరీ....నిజంగా పేరు తెలుసుకోవాలని కాదు.

"రాజ్యం...." అంది తలెత్తకుండానే....

అన్నం తిన్నాక కారేజి కడిగి మూలగా పెట్టి వచ్చి కూచుంది. వర్షం మరింతగా పెరిగి చప్పుడు చేస్తోంది.

"ఈ యిల్లు మీదా...." అంది నెమ్మదిగా....

అవునన్నట్లు తలూపాడు చౌదరీ.

"మరి ఎప్పుడూ తాళం వేసుంటుందే...." సందేహిస్తున్నట్టు మరీ నెమ్మదిగా అడిగింది.

"నేను ఈ వూళ్ళో ఉండను. ఎప్పుడేనా పనుంటే నెలకో.... రెండు నెలలకో ఓసారి వస్తాను" అన్నాడు. ఇందాకటికన్నా చిరాగ్గా ఉంది చౌదరీకి. నెమ్మదిగా లేచాడు. గుమ్మంవేపు నడిచాడు.

తనూ గుమ్మంవేపే చూస్తోంది. నెమ్మదిగా తలుపు చేరేశాడు. దగ్గరగా వస్తూ...."సీకు పనిప్పిస్తాను....యిలా అడుక్కోటం మానేస్తావా...." అన్నాడు.

రాజ్యం ఏం మాట్లాడలేదు చూడ్డం తప్ప....

"ఏం...." అన్నాడు....వొంటికి, వొళ్ళు తగిలేలా యింకా దగ్గరగా వస్తూ....

ఆ తర్వాత చాలాసేపు చౌదరీయే మాట్లాడాడు.... వేటికీ రాజ్యం జవాబులు చెప్పక పోయినా....

ఆ సాయంత్రం రెండుగంటలు కురిసింతర్వాత ఆగిపోయింది వర్షం. వర్షం ఆగిన కాస్సేపటికి తడి ఆరిపోయిన చీరని చుట్టపెట్టుకుంది రాజ్యం.

"రాత్రికి ఎక్కడేనా ఉండి, రేపు పొద్దునే రా....తెలుసున్న వాళ్ళు వస్తున్నారు. వాళ్ళు నిన్నిక్కడ చూట్టం బాగుండదు" అని రాజ్యానికి అయిదు రూపాయ లిచ్చి పంపించేశాడు చౌదరీ.

ఆ రెండుగంటలూ వర్షం, చౌదరీ యింటిచుట్టూ....ఆ ఇంటికి దూరంగా ఉన్న మర్రిచెట్టు చుట్టేకాదు....ఆ వూరంతా కురిసింది. ఇళ్ళకి వెడుతున్నవాళ్ళు అక్కడా, ఇక్కడా ఆగి వర్షంతగ్గాక వెళ్ళారు. ఇళ్ళలో ఉన్నవాళ్ళు వర్షం వెలిశాక బైటికొచ్చారు.

• • •

కనుచూపు దూరంలో కనిపిస్తున్న నీలరంగు మేడదగ్గరికి వెళ్ళేలోపు ఎక్కడ వర్షం తడిపేస్తుందో అని సందేహిస్తూ....చేతిలో పసిగుడ్డుని దగ్గరగా పొదువుకుని ఆ రెండుగంటలూ మర్రిచెట్టు మొద

ల్లోనే వొదిగి, వొదిగి కూచుండిపోయింది కాంతం. పాపం వర్షానికి తెలియదు. ఆ ముష్టిదానికి ఇల్లూ వాకిలీ లేదని, మందుకూడా వేయించ లేని ఆ తల్లిచేతుల్లోని పసిగుడ్డుకి జ్వరంగా ఉందని గాలికీ తెలియదు. అందుకనే ఆ రెండూ కలిసి మర్రిచెట్టు మొదల్ని మామూలుగా తడిపి నట్టే, ఆ రోజూ తడిపేశాయి.

తెల్లారేక....

తన చేతిలోని పసిగుడ్డు వొళ్ళు కొత్తవేడితో కాల్తోందని తెలి సింది. కాని....అది న్యుమోనియా అనీ....తనపిల్లని చంపేరోగం అనీ ముష్టి కాంతానికి తెలియలేదు.

ఇంటితాళం చూసి చౌదరీ వూరెళ్ళిపోయుంటాడని అనుమాన పడ్డా....ఆశ చావక చాలాసేపు వరండాలో కూర్చోలేక మానలేదు రాజ్యం.

రాజ్యం కూచున్న చౌదరీ యింటికీ....ఫర్లాంగు దూరంలో ఉన్న మర్రి చెట్టుకీ మధ్య నేలమీద మట్టిలో నిన్నటి వర్షంలో నాని, మళ్ళీ పొద్దున్నే కొద్దిగా ఎండకు ఎండిన ఓ న్యూస్‌పేపర్ నెమ్మదిగా కదుల్తోంది.

దాన్లో....

"ప్రత్యేక బృందం అంచనాలవల్ల దేశంలో....యిన్ని లక్షల మందికి ఉండడానికి ఏ గూడు లేదని తేలింది. త్వరలో...."

ఆ పేపర్లో మిగిలిన అక్షరాల్ని వర్షం తినేసింది.

'వసుధ'లో ముద్రితము. కన్నడంలోకి

(సుధ-21-11-71) అనువదింపబడింది